రేపు పట్టణంలో సదర్ సమ్మేళనం

కామారెడ్డి టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాకేంద్రంలో గోకుల్‌సేన ఆధ్వర్యంలో ఈనెల 10న ఆదివారం సదర్ సమ్మేళనం నిర్వహించ తలపెట్టినట్లు యాదవ సంఘం నాయకుడు కుంబాల లక్ష్మణ్ తెలిపారు. సదర్ పండుగ పురాతనమైనదని, యాదవులు భక్తిశ్రద్ధలతో ప్రతీ సంవత్సరం దీపావళి తర్వాత నిర్వహించుకునే పండుగ అని తెలిపారు. కామారెడ్డిలో మొదటిసారిగా పెద్దఎత్తున ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నందున పెద్దఎత్తున యాదవులు హాజరుకావాలని, ఆదివారం సాయంత్రం 5గంటలకు స్థానిక వీక్లీ మార్కెట్ నుంచి ర్యాలీ ప్రారంభం అవుతుందని ఆయన పేర్కొన్నారు.


● భిక్కనూరు మండలం జంగంపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర సివిల్ సప్లయ్ ముఖ్య కార్యదర్శి ఎస్‌కే చౌహాన్

'ఆ మిల్లులకు'.. కేటాయింపుల్లేవ్!

- జిల్లాలో డిఫాల్ట్ రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపులు లేవు
- మొత్తం 49 మిల్లులను డిఫాల్ట్ కింద చూపిన అధికారులు
- సకాలంలో సీఎంఆర్ రైస్ ఇవ్వనందుకే ఢిఫాల్ట్‌లోకి..
- 2023-24 వానాకాలం, యాసంగి సీజన్‌ల సీఎంఆర్ బియ్యం మిల్లుల వద్దే..
- ప్రస్తుతం 129 రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయింపులు
- అంతటా కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటివరకు 51,480 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

కామారెడ్డి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రతీ ఏటా ఆయా రైస్ మిల్లులకు కేటాయిస్తుంటారు. అయితే, రైస్‌మిల్లర్లు మర ఆడించి సీఎంఆర్ కింద తిరిగి ప్రభుత్వానికి బియ్యాన్ని అందించాల్సి ఉంటుంది. అయితే రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయింపుల్లో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని, పలు రైస్ మిల్లర్లు సీఎంఆర్ బియ్యం ఇవ్వకుండా ఎగ్గొడుతున్నారంటూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కేటాయింపుల్లో కఠిన నిర్ణయాలు తీసుకుంది. సకాలంలో సీఎంఆర్ రైస్ ఇవ్వని మిల్లులను డిఫాల్ట్‌లో పెట్టాలని, అలాగే వారిపై ఆర్‌ఆర్ చట్టం ప్రయోగించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అదేవిధంగా ఈ వానాకాలం ధాన్యం కేటాయింపులు చేయవద్దని జీవో జారీ చేసింది. దీంతో జిల్లాలో డిఫాల్ట్‌లో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపులు అధికారులు చేయడం లేదు. మిగితా మిల్లులు సైతం బ్యాంకు గ్యారెంటీ ఇస్తేనే కేటాయింపులు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 129 మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేశారు.

జిల్లాలో 179కి పైగా రైస్ మిల్లులు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో 179కి పైగా రైస్ మిల్లులు ఉన్నాయి. ఇందులో 136 రా రైస్ మిల్లులు ఉండగా.. మరో 35కి పైగా బాయిల్డ్ రైస్‌మిల్లులు ఉన్నాయి. జిల్లాలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాలకు ప్రతినెలా పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 2.53 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల ద్వారా ప్రతీనెల 5,462 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పౌర సరాఫరాల శాఖ ద్వారా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీకి ప్రతిఏటా రెండు సీజన్‌లలో రైతులు పండించిన ధాన్యాన్ని రైస్ మిల్లుల్లో మర ఆడించి బియ్యంగా మార్చి పేదలకు ప్రభుత్వం పంపిణీచేస్తుంది.


● ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

49 మిల్లులు ఢిఫాల్ట్‌లో..

జిల్లాలో గతంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఆయా రైస్‌మిల్లులకు కేటాయించారు. అయితే కొన్ని రైస్ మిల్లులు సకాలంలో సీఎంఆర్‌ను తిరిగి ప్రభుత్వానికి చెల్లించకుండా ఎగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికీ సీఎంఆర్ కేటాయించని పలు రైస్ మిల్లులను డిఫాల్ట్ కింద చేర్చారు. ఇటీవల కాలంలో రైస్ మిల్లు ల్లో సీఎంఆర్ ధాన్యం నిల్వలపై ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. పలు మిల్లుల్లో కేటాయించిన ధాన్యం నిల్వలు లేకపోవడంతో వాటిపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఆ ధాన్యాన్ని ఎక్కడికి తరలించారు, అలాగే పాడైన ధాన్యం ఏం చేశారనే దానిపై లెక్కలు తీస్తున్నారు. ఇలా 49 రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వలు లేకపోవడం, సీఎంఆర్ రైస్ సకాలంలో పెట్టకపోవడంతో వాటిని డిఫాల్ట్ కింద చేర్చారు. అయితే 2023-24కు వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించి సీఎంఆర్ రైస్ మిల్లుల వద్దనే ఉంది. వానా కాలానికి సంబంధించి 2.98 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ ఇవ్వాల్సి ఉండగా.. 2.22 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇచ్చారు. మిగితా 75 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మిల్లుల వద్దే ఉంది. యాసంగి సీజన్‌లో 2.19 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్‌ను మిల్లర్లు ఇవ్వాల్సి ఉండగా.. 70 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మాత్రమే ఇచ్చారు. మిగితా 1.50 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మిల్లుల వద్దే బకాయి ఉంది. ఈ సీఎంఆర్ ఇవ్వని 49 మిల్లులను డిఫాల్ట్‌లో పెట్టారు.

ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ సీజన్‌లో 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 5.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు పౌర సరాఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు 423 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత పక్షం రోజుల కిందట ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో కొనుగోళ్లు ప్రారంభించారు. అయితే మిల్లులకు ధాన్యం కేటాయింపుల్లో ప్రభుత్వం ఈసారి కఠినంగా వ్యవహరిస్తోంది. బ్యాంక్ ష్యూరిటీ ఇచ్చిన మిల్లులకు మాత్రమే ధాన్యం కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ధాన్యం నిల్వలను బట్టి 10 శాతం గ్యారెంటీ ఇచ్చిన మిల్లులకే కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బాయిల్డ్ రైస్ మిల్లుల్లో 32 టన్నుల సామర్థ్యనికి 40 వేల క్వింటాళ్ల ధాన్యం, 40 టన్నుల సామర్థ్యానికి 50 వేల క్వింటాళ్లు, 50 టన్నుల సామర్థ్యానికి 60 వేల క్వింటాళ్లు, 60 టన్నుల సామర్థ్యానికి 70వేల క్వింటాళ్లు కేటాయించేలా ఏర్పాట్లు చేశారు. రైస్ మిల్లులకు ఇదే ప్రతిపాదికన జిల్లా పౌర సరాఫరాలశాఖ

(మిగతా 8వ పేజీలో...)




అంకోల్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

● సబ్ కలెక్టర్ కిరణ్మయి

నసురుల్లాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకోల్ క్యాంపు, బొమ్మన్‌దేవ్‌పల్లి, దుర్కి గ్రామాల్లో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాలను సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూయ రైతులు పండించిన వరి పంటను వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని రైతులను ఆమె కోరారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ బావయ్య, ఆర్ఐ హన్మాండ్లు, రైతులు తదితరులు ఉన్నారు.

హౌస్ లిస్టింగ్ పూర్తి చేయాలి

కామారెడ్డి టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏ ఒక్క ఇల్లు కూడా వదలిపెట్టకుండా హౌస్ లిస్టింగ్ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మండల ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి సమగ్ర సర్వే కార్యక్రమంలో భాగంగా మొదటి దశలో చేపట్టిన హౌస్ లిస్టింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. హౌస్ లిస్టింగ్ చేసి ప్రతీ ఇంటికీ- స్టిక్కరింగ్ చేశారా? లేదా? అనేది మండల ప్రత్యేకాధికారులు పరిశీలించాలని తెలిపారు. ఎన్యూమరేషన్ బ్లాక్ గ్రామ పంచాయతీల వారీగా నిర్వహించాలని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న హౌస్ లిస్టింగ్ పనిని త్వరితగతిన పూర్తిచేయాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు రంగనాథ్‌రావు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి వీఆర్ఆర్ వరప్రసాద్

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం : జిల్లా న్యాయాధికారి

కామారెడ్డి టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న పరిస్థితుల దృష్ట్యా ప్రతీ మహిళ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయాధికారి వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. న్యాయసలహా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయ సేవాధికార సంస్థ చట్టం 1987లో తీసుకువచ్చినప్పటికీ.. 1995 నుంచి ఆచరణలోకి వచ్చిందన్నారు. న్యాయసేవ కోసం 15100 టోల్ ఫ్రీ నెం.కు కాల్‌చేయాలని తెలిపారు. ఇందులో సీనియర్ సివిల్‌జడ్జ్ నాగరాణి, విద్యాసంస్థల చైర్మన్ హరిస్మరణ్‌రెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మాయ సురేష్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మోహన్‌రావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పండించే బియ్యంకు మంచి పేరు

● రాష్ట్ర పౌర సరాఫరాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి చౌహాన్ ● కలెక్టరేట్‌లో అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశం ● జిల్లాలో పలుచోట్ల కలెక్టర్‌తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

కామారెడ్డి టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పండించే బియ్యంకు మంచి పేరుందని, ఆ బియ్యం రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేయడం జరుగుతుందని రాష్ట్ర పౌర సరాఫరాలశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి చౌహాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పండించే ధాన్యంకు మంచి పేరు ఉందని, ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు సరాఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే రాష్ట్రంలో పండించిన బియ్యం తిరిగి నిత్యావసర సరుకుల పంపిణీ ద్వారా రాష్ట్రంలోని నిరుపేద ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఉత్పత్తితో పాటు క్వాలిటీని కూడా పెంచడం జరిగిందని తెలిపారు. మిల్లర్లకు వారి గత సీఎంఆర్ పనితీరును బట్టి పారదర్శకంగా ధాన్యం కేటాయించడం జరుగుతుందని తెలిపారు. మిల్లర్లు ఎలాంటి అపోహలు, అనుమానాలు పెట్టుకోకూడదని తెలిపారు. మిల్లర్ల సహకారంతో ధాన్యం సేకరించడం మిల్లింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలను తీసుకురావాలని, అదేవిధంగా ధాన్యాన్ని శుభ్రపరిచి తేవాలని అన్నారు. పంట పూర్తిగా పండి కోతకు ఆస్కారం ఉన్నప్పుడే కోయాలని తెలిపారు. పచ్చిగా ఉన్నప్పుడు కోయడం మంచిది కాదని తెలిపారు. ఆరబెట్టి తీసుకువచ్చిన ధాన్యానికి మంచి మద్దతు ధర కల్పించడం జరుగుతుందని, ఎలాంటి కోతలు చేయబడవని తెలిపారు. పచ్చిపంట కోయడం నేరమని ఆయన అభిప్రాయపడ్డారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతీ గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కాంటా అయిన మూడు, నాలుగు రోజుల్లోనే చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. నాణ్యమైన ధాన్యం ప్రతీ బస్తాలో 40.650 కిలోలుగా తూకం వేయడం జరుగుతుందని, రైతులు ఈ విషయాన్ని గ్రహించాలని తెలిపారు. ఆ తర్వాత కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో 423 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, సన్నరకం వడ్లు కొనుగోళ్లకు అవసరమైన చోట ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 51,480 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచామని తెలిపారు. రైస్‌మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీ అందించారని, గోనె సంచుల సమస్య లేదని తెలిపారు. ధాన్యం మిల్లులకు రవాణా చేసేందుకు 10 ట్రాన్స్‌పోర్టర్లను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సింధూశర్మ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వి.విక్టర్, ఆర్డీవో రంగనాథ్‌రావు, సివిల్ సప్లయ్ డీఎం రాజేందర్, ఇన్‌చార్జి సివిల్ సప్లయ్ అధికారి నరసింహరావు, జిల్లా సహకార అధికారి రామ్మోహన్, డీఏవో తిరుమల ప్రసాద్, డీఆర్‌డీఓ సురేందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర పౌర సరాఫరాల శాఖ అధికారి డీఎస్.చౌహాన్


సదాశివనగర్‌లో కొనుగోలు కేంద్రం వద్ద తేమ శాతం పరిశీలిస్తున్న రాష్ట్ర సివిల్ సప్లయ్ ముఖ్య కార్యదర్శి

● నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలి

సదాశివనగర్(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని 17శాతం తేమ ఉండేవిధంగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, నాణ్యమైన ధాన్యం వస్తేనే బియ్యం ఎక్కువ రోజులు మన్న గలుగుతాయని రాష్ట్ర సివిల్ సప్లయ్ ముఖ్యకార్యదర్శి చౌహాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌తో కలిసి పరిశీలించారు. కల్లాల వద్ద ఆరబోసిన ధాన్యాన్ని స్వయంగా తేమ శాతం మిషన్‌లో వేసి తేమ శాతం పరిశీలించారు. తూకం వేసిన బస్తాలను పరిశీలించి తూకం వేసిన విధానం, ఎంత బరువు వేశారన్న? సమాచారాన్ని కొనుగోలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరి ధాన్యాన్ని జల్లి వేసి ప్రభుత్వం సూచించిన తేమశాతం వరకు ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే అలాంటి ధాన్యం మిల్లులలో బియ్యం తయారు చేస్తే ఎక్కువ రోజులు నాణ్యతగా ఉంటాయని తెలిపారు. జల్లివేసి ఆర బెట్టిన ధాన్యాన్ని బస్తా తూకం మాత్రమే అధికంగా వేసి కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ధాన్యంతో పాటు రైతు పట్టా పాస్‌బుక్ జీరాక్స్, బ్యాంక్ పాస్‌బుక్ జీరాక్స్ అందజేసినట్లయితే మూడు రోజులలో ధాన్యం డబ్బులు రైతుల ఖాతాలో వేయడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని ఏర్పాట్లు చేస్తు తూకాలలో మోసాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా అధికారులదని తెలిపారు. ఇందులో డీఏవో తిరుమలప్రసాద్, ఏడీఏ రత్న, తహసీల్దార్ గంగాసాగర్, సింగిల్ విండో చైర్మన్ కమలాకర్‌రావు, వ్యవసాయాధికారి ప్రజాపతి, ఏఈవో కవిత, సీఈవో విగ్నేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

● వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

భిక్కనూరు(ఆంధ్రజ్యోతి): రైతులు వరి కోత సమయంలో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని సివిల్ సప్లయి ప్రిన్సిపల్ సెక్రెటరీ చౌహాన్ అన్నారు. శుక్రవారం భిక్కనూరు మండలంలోని జంగంపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని, ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం పచ్చిగా ఉన్నప్పుడే కోయడం కారణంగా బియ్యం చెడిపోయే అవకాశం ఉందని, ధాన్యం నిల్వ కూడా ఉండదని, ధాన్యం కోసే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం రైతు కొనుగోలు కేంద్రాల వద్ద ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో ఆర్డీవో రంగనాథ్, తహసీల్దార్ శివప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్ సిద్ధరాములు, విండో ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, విండో డైరెక్టర్లు, ఏవో రాధ, తదితరులు ఉన్నారు.

రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలి

● రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బీర్కూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతు సోదరులు ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామంలోని రైతు వేదికలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు వరికి బదులుగా ఇతరత్రా పంటలను సాగు చేయాలని అన్నారు. ఇందులో భాగంగా ఆయిల్‌పాం పంట సాగు ఎంతో మేలన్నారు. ఆయిల్‌పాం పంట సాగు వల్ల అధిక లాభాలు గడించవచ్చన్నారు. ఆయిల్‌పాం పంట ధీర్ఘకాలిక పంట అని, అలాగే కాకులు, కోతలు బెడద ఉందన్నారు. ఆయిల్‌పాం మొక్క ఒక్కసారి నాటుకుంటే 30 ఏళ్ల వరకు పంట కోతకు వస్తుందన్నారు. పంటను విక్రయించడానికి మార్కెట్ భయం ఉండదని, ఆయిల్‌పాం పంట సాగుకు ముందుకు రావాలని ఆయన కోరారు. ఆయిల్‌పాం సాగులో ఒకసారి పంట వేసుకుంటే 30ఏళ్ల వరకు ప్రతీనెల రెండు కోతలు వస్తాయన్నారు. సంవత్సరం పొడవునా దిగుబడులతో రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చన్నారు. వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే ఆయిల్‌పాం సాగు ఒక్కటే పరిష్కారమని జిల్లా ఉద్యాన అధికారిణి జ్యోతి అన్నారు. ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఒక మొక్కకి రైతు వాటా 20 కట్టాలన్నారు. డ్రిప్‌కి 90 శాతం రాయితీ ఇస్తుందన్నారు. పంట వేసిన తరువాత ఎరువుల యాజమాన్యం కోసం ఒక ఎకరానికి 4,200 రూపాయల చొప్పున ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. ఆయిల్‌పాం పంట సాగు చేయాలనుకున్న రైతులు బాన్సువాడ ఉద్యాన శాఖ అధికారిణి సంతోషిణిని సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయిల్‌పాం పంటను సాగు చేస్తున్న రైతులు తమ అనుభవాలను రైతులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌పాం సిబ్బంది, ఏఈవో అనూషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


● రైతునగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి


కామారెడ్డిలోని 25వ వార్డులో గల పట్టణ ప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

పట్టణ ప్రకృతి వనాల నిర్వహణ ఏదీ!?

- అధ్వానంగా పట్టణ ప్రకృతి వనాల నిర్వహణ
- పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు నిండిపోవడంతో ప్రజలకు అందని ఆహ్లాదం
- పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇదే పరిస్థితి
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

7లో


బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో సీఎం జన్మదిన వేడుకలు


సాలూర మండల కేంద్రంలో పండ్లు పంచుతున్న విద్యార్థినులు


నవీపేటలో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

బోధన్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బోధన్ పట్టణం, బోధన్, సాలూర మండలాల్లోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు అన్ని విధాల సౌకర్యాలు కల్పిస్తూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, పాషా మొయినోద్దీన్, కౌన్సిలర్‌లు శరత్ రెడ్డి, ధూప్ సింగ్ పాల్, జహీర్, దామోదర్, బడు, సాయిలు, సాలూరలో సాలూర మండల అధ్యక్షులు మందర్నా రవి, అల్లె జనార్ధన్, అల్లె రమేష్, కేజీ గంగారాం, శ్రీనన్న, సొక్కం రవి, లక్ష్మణ్, నాగరాజు, ఇల్తెపు రమేష్, గౌస్, బుద్దె లక్ష్మణ్, మందర్నా లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నవీపేట: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నిరుపేదలకు రగ్గులు, దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో భగవాన్, మోస్రా సాయిరెడ్డి, గంగాధర్, ముస్తాక్, మోహన్, సంజీవ రెడ్డి, గోపాల్, మూసా, సుజాత పాల్గొన్నారు.

కోటగిరి: ఉమ్మడి మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కోటగిరి, పోతంగల్ మండల కేంద్రాల్లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంతు, నాయకులు మనోహర్, మధు, షాహీద్, బర్ల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ కాంగ్రెస్ నాయకులు జావీదోద్దీన్, సాయిరెడ్డి, ధనుంజయ్, నితిన్, కార్తీక్, ఎంఎల్ రాజు, కృష్ణ, అంజయ్య, హాజీ ఖాన్, సురేష్ పటేల్ పాల్గొన్నారు.

మెండోర: సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మండలంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇటువంటి జన్మదిన రోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలు అందించాలని భగవంతున్ని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండోజి రవి, డీసీసీ జనరల్ సెక్రెటరీ సోం రాజేందర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దిసాయి, కొప్పెల మోహన్, డీసీ గంగయ్య, సోం రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని కస్తూర్బ పాఠశాలలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను విద్యార్థినుల మధ్య కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. సీఎం జన్మదిన వేడుకలకు ముఖ్యఅతిథిగా పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్ హాజరయ్యారు. అనంతరం విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, మాజీ ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, పుప్పాల అశోక్, గిర్మాజీ గంగాధర్, గడ్డం అనిల్, గిర్మాజీ గోపి, శెట్‌పల్లి ఆనంద్, మామిడి శ్రీనివాస్, అంజాద్, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచు కున్నారు.

కమ్మర్‌పల్లి: స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థుల మధ్య కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థినులకు నోటు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పడిగెల ప్రవీన్, బుచ్చి మల్లయ్య, రేవతి గంగాధర్, సింగిరెడ్డి శేఖర్, తెడ్డురమేష్, వేముల గంగారెడ్డి, అశోక్, అజహర్, పాష, గణేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి కాంగ్రెస్ నాయకులు సంబురాలు జర పుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివ కుమార్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొరిపెల్లి లింగారెడ్డి, బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, గడ్డం జీవన్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని టీచర్స్‌కాలనీలో డెఫండెమ్ పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సీఎం జన్మదిన కేక్ కట్ చేసిన అనంతరం పాఠశాల విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, సాయిబాబాగౌడ్, కొంతం మురళీ, ఫయీం, స్వామి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముప్కాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్, కోపరేటివ్ సొసైటీ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిలు కేక్ కట్ చేసి సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.


కమ్మర్‌పల్లి కస్తూర్బా పాఠశాలలో


మోర్తాడ్‌లో కస్తూర్బా పాఠశాలలో..


మెండోరలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ నాయకుల చేరిక


కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఈరవత్రి అనిల్

ముప్కాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల బీఆర్ఎస్ నాయకులు రియాజ్, ఖజీం, యూనీస్, మహ్మద్ వారి అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామంలో టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ శుక్రవారం వారికి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలనతో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర సహకార యునియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్తెన్న, తౌటు గంగాధర్, నరేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరం

రెంజల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని ఎంఈవో ఆంజనేయులు అన్నారు. శుక్రవారం సీవీ రామన్ జయంతి సందర్భంగా రెంజల్ ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీలు, రంగోళి, లలిత, సంగీత పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విజయానంద రావు సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు గంగాధర్, అరుణ్, శేఖర్, పీడీ కృష్ణమూర్తి, మధుసూదన్, సాంబశివరావు, నర్సింహ రావు, అనుపమ, విజయ కిషోర్, ప్రసాద్, తదతరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఉచిత న్యాయసేవ

బోధన్‌రూరల్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికి ఉచిత న్యాయసేవ అందించబడుతుందని శుక్రవారం బోదన్‌లో న్యాయసేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అంబేద్కర్ చౌరస్తాలో ర్యాలీ నిర్వహించారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటి ఆధ్వర్యంలో అర్హులకు న్యాయ సహాయం ఉచితంగా అందజేస్తున్నట్లు పారా లీగల్ వాలంటరీ పద్మాసింగ్ అన్నారు. న్యాయసేవ సందర్భంగా పట్టణంలోని వివిధ కళాశాల విద్యార్థులతో ప్రధాన కూడళ్ల వద్ద నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, వృద్ధులు, మహిళలకు ఉచిత న్యాయసేవ అందించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవ సంస్థ పారా లీగల్ వాలంటీర్లు సాయేంద్ర జాదవ్, ప్రధానోపాధ్యాయులు కృష్ణ, రాజేష్ రెడ్డి, అధ్యాపకులు కిషోర్, నాగేశ్వర్‌రావు ఉన్నారు.

కరెన్సీపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలి

వేల్పూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్‌బీఐ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లేకుంటే నేడు రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా లేదని షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంబవ చమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం రిజర్వు బ్యాంకు ద్వారా కరెన్సీపై డాక్టర్ అంబేద్కర్ ఫోటోను ముద్రించాలని డిమాండ్ చేశారు. సగటు మనిషి వ్యక్తి కోణంలో నుంచి ఆర్థిక కోణాన్ని దృష్టిలో ఉంచుకొని 1935 ఏప్రిల్ 1న రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేయడం జరిగిందంటే అది కేవలం అంబేద్కర్ కృషి వల్లనే సాధ్యపడిందన్నారు. అందుకే కరెన్సీ నోట్లపై అంబేద్కర్ బొమ్మను ముద్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు నర్సయ్య, కార్యవర్గ సభ్యులు గంగాధర్, అంజయ్య సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ అంకిత్


అంకాపూర్‌లో సర్వేను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్


సాలూరలో సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

ఆర్మూర్‌రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్ గ్రామంలో శుక్రవారం సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి, కుల గణన సర్వేను అదనపు కలెక్టర్ అంకిత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్యూమారేటర్‌కు, పంచాయతీ కార్యదర్శి హారికకు సర్వేకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఇంటింటికి స్టిక్కర్‌లు అతికించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్య క్రమంలో మండల ప్రత్యేక అధికారి నర్సయ్య, పంచాయతీ అధికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి పుప్పాల హారిక, ఇన్యూమారేటర్లు పాల్గొన్నారు.

వేల్పూర్: మండల కేంద్రంలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. గ్రామంలోని 4,5 వార్డులలో ఇళ్లకు వేసిన స్టిక్కర్‌లను పరిశీలిస్తూ ఇంటి యజమానులను సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న సమగ్ర కులగణన ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలకిషన్, గ్రామకార్యదర్శి వినోద్, సూపర్‌వైజర్, ఏపీవో అశోక్, సీసీ రవి, ఎన్యూమారేటర్లు, తదితరులు ఉన్నారు.

సర్వేకు ప్రతీఒక్కరు సహకరించాలి

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్‌రూరల్: ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరిపిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు తమవంతు పూర్తి సహకారం అందించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం సాలూర మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్న తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోధన్ డివిజన్‌లో ఇంటింటి సర్వే కోసం ఏ ఒక్క నివాస గృహం సైతం మినహాయించబడకుండా ప్రతి ఇంటిని సర్వే జరపాలన్నారు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలలోని రికార్డుల ఆధారంగా ఎన్యూమరేషన్ బ్లాక్‌లను గుర్తించామన్నారు. ఒక్కో బ్లాక్‌కు ఒకరు చొప్పున ఎన్యూమలేటర్లను నియమించామని, ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే నిర్వహించాల్సిన తీరుపై వారికి శిక్షణ కల్పించామన్నారు. 9 నుంచి సమగ్ర కుటుంబ వివరాల సేకరణ ప్రారంభం అవుతుందని వివరించారు. సర్వే బృందానికి నిర్దీత సమాచారాన్ని అందిజేస్తూ డివిజన్‌లో కుటుంబ సర్వే విజయవంతమయ్యేలా సహకరించాలన్నారు.

కుటుంబ సర్వే అంటూ సైబర్ నేరగాళ్ల మోసాలు ప్రజలు నమ్మొద్దు: సీఐ



బోధన్‌రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సర్వే జరుగుతున్న నేపథ్యంలో కొందరు సైబర్ నేరగాళ్లు కుటుంబ సర్వే చేస్తున్నామంటూ సైబర్ నేరగాళ్లు కాల్ లిస్ట్ పంపి ఓటీపీలు చెప్పామని అడుగుతున్నారని ఇలాంటి మోసాలు ప్రజలు నమ్మవద్దు పట్టణ సీఐ వెంకట నారాయణ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇతర వ్యక్తుల నుండి ఓటీపీ చెప్పామని అడిగితే సంబంధిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పవద్దన్నారు. కుటుంబ సర్వేకు వచ్చే అధికారులకు పూర్తి సహయ, సహకారాలు అందించాలన్నారు. కుటుంబ సర్వే పట్ల ఎలాంటి అపోహలు నమ్మొద్దని ఆయన పేర్కొన్నారు. ఏదైనా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు.

ఆన్‌లైన్ సెంటర్‌లను పరిశీలించిన సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకులు ఎప్పటికప్పుడు కంప్యూటర్‌లో నమోదు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం ఆన్‌లైన్ సెంటర్‌ల నిర్వాహకులతో సబ్ కలెక్టర్ మాట్లాడారు. ఇందులో భాగంగా ఎన్యూమలేటర్లు ప్రస్తుతం సర్వే కోసం ఇంటింటికి కుటుంబాలను గుర్తిస్తూ స్టిక్కర్లు వేస్తున్నారని, 9వ తేది నుండి అధికారులు పూర్తి నిబంధనల మేరకు ఎన్యూమరేటర్లు సర్వే చేయాలన్నారు. సర్వే చేసిన కుటుంబ వివరాలను ఎప్పటికప్పుడు కంప్యూటర్‌లలో నమోదు చేయవాల్సి ఉంటుందన్నారు. శుక్రవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సాలూర, బోధన్ మండలాల్లో ఎంపిక చేసిన ఆన్‌లైన్ సెంటర్‌లను పరిశీలించారు. ఆయన వెంట సాలూర తహసీల్దార్ శశిభూషణ్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్రాద్ పాఠశాలలో దంత వైద్య శిబిరం

మాక్లూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్రాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేఘాన డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదివే 200 మంది విద్యార్థులకు ప్రొఫెసర్ వెంగల్‌రావు ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేష్, దంత వైద్యులు డాక్టర్ వైభవి, డాక్టర్ ధనుంజయ్, డాక్టర్ స్నేహ, డాక్టర్ నవ్య, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ గాయత్రి పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

నవీపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్యాపూర్‌కు చెందిన డాంగే లక్ష్మణ్ అనే 44సంవత్సరాల వ్యక్తి ఆచూకీ లభ్యమైందని ఎస్ఐ వినయ్ తెలిపారు. గత ఆగస్టు నుండి లక్ష్మణ్ కనిపించకపోవడంతో ఇటీవల కుటుంబ సభ్యులు నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం డాంగే లక్ష్మణ్ నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆచూకీ లభించగా అతనిని నవీపేట పోలీస్ స్టేషన్ తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగిందని ఎస్ఐ పేర్కొన్నారు. డాంగే లక్ష్మణ్ అదృశ్యం అయిన విషయం విధితమే.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

బోధన్‌రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష పడిన ఘటన బోధన్‌లో చోటు చేసుకుందని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. గురువారం మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిని బోధన్ పోలీసులు కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ న్యాయమూర్తి శేషతల్ప సాయి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి ఒకరోజు జైలు శిక్షతో పాటు 500రూపాయల జరిమాన విధించారని పట్టణ సీఐ తెలిపారు.


ప్రమాణ స్వీకారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

పరమేశ్వరుడి ఆశీస్సులతో
ప్రజలు సుభిక్షంగా ఉండాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పరమేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర ఆలయం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ హరికాంత్ చారితో పాటు ధర్మకర్తలను ప్రమాణ స్వీకారం చేయించి కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలు భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాయన్నారు. బోధన్ చక్రేశ్వరాలయానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు, చరిత్ర ఉందన్నారు. దేవాలయాలు సూచి, శుభ్రత పాటిస్తూ భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. భక్తులు దేవాలయానికి వస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. దేవాలయాల్లో మనస్ఫూర్తిగా పూజిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయన్నారు. దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందన్నారు. బోధన్ నియోజకవర్గంలోని దేవాలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్య దాము, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, నాగేశ్వర్ రావు, పాషా మొయినోద్దీన్, దేవాదాయ శాఖ ఈవో రవీందర్ గుప్తా, వేద పండితులు గణేష్ శర్మ, ధర్మకర్తలు లక్ష్మణ్, కమల భూమేష్, కవిత, సూర లింగం, నగేష్ పాల్గొన్నారు.

గంగపుత్రుల అభివృద్ధికి కృషి చేస్తాం

● ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి


ఆర్మూర్ గూండ్లచెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవన ఉపాధి కోసం చేపలు పట్టే గంగపుత్రులు ప్రభుత్వం ద్వారా పొందే అన్ని పథకాలకు అర్హులని వారి అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్మూర్ పట్టణంలోని గూండ్ల చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో 190చెరువుల్లో సుమారు 27లక్షల 96 వేల చేప పిల్లలను విడుదల చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఆర్మూర్‌లోని గూండ్ల చెరువులో 55వేల చేప పిల్లలను వదిలామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. గతంలో 100శాతం చేప పిల్లలను విడుదల చేస్తే ఈ సంవత్సరం 50శాతం విడుదల చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. బీజేపీ ప్రభుత్వం మత్స్యకారులకు 75శాతం సబ్సిడీపై వాహనాన్ని అందజేసిందన్నారు. చెరువులు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని, కబ్జా అయిన చెరువులను సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫిషరీష్ అధికారి ఆంజనేయులు, బింగి పెంటయ్య, చిన్నారెడ్డి, కంచెట్టి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎడపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ పరిధిలోని పలు సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ మరమ్మత్తులు చేపడుతున్న దృష్ట్యా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎడపల్లి ఏడీఈ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఎడపల్లి సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధన్ రూరల్ లోని పెగడాపల్లి, ఊటపల్లి, రెంజల్ మండలంలోని నీలా, ఎడపల్లి మండలంలోని రానాకలాన్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ మరమ్మ తులు చేపడుతున్న దృష్ట్యా నేడు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలపివేయనున్నామని ప్రజలు సహకరించాలని కోరారు.

నవీపేట : నవీపేటలోని 33/11సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల పాటు జన్నేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. సబ్ స్టేషన్‌ల మరమ్మత్తులలో భాగంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు.

మత్తుపదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు


క్షత్రీయ కళాశాలలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ సోమనాథం

ఆర్మూర్‌రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించిన, సరఫరా చేసిన కఠిన చర్యలు తప్పవని నార్కోటిక్స్ డీఎస్పీ సోమనాథం అన్నారు. శుక్రవారం ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం గంజాయి, మత్తుపదార్థాలు నియంత్రణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నార్కోటిక్స్ డీఎస్పీ సోమనాథం మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తుపదార్థాలు వినియోగించిన, సరఫరా చేసిన అక్రమ రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీటిపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీస్ విభాగాలను ఏర్పాటు వ్యాపారాలను అరికట్టడానికి నిరంతరం నిఘా పెట్టామన్నారు. విద్యాసంస్థల్లో గంజాయి లాంటి మత్తుపదార్థాలు విద్యార్థులు వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడేందుకు విద్యాసంస్థలు చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, మత్తుపదార్థాల విక్రయంపై సమాచారం అందించడానికి ప్రతీఒక్కరు ముందుకు రావాలన్నారు. మత్తుపదార్థాలు నియంత్రించడంలో ప్రతీఒక్కరు సహకారం అందించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గంజాయి నిర్మూలన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి, కళాశాల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్, ప్రిన్సిపాల్ పాండే పాల్గొన్నారు.

14 గ్రామాల చెరువుల్లో
ఉచిత చేప పిల్లల పంపిణీ

వేల్పూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలంలోని 14 గ్రామాల్లో ఉన్న 40చెరువుల్లో 2024-25 గాను ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం మండలంలోని 14 గ్రామాల్లో 40చెరువుల్లో మొత్తం 6లక్షల 69వేల 375 చేప పిల్లలను వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి ఉచిత చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకార్మికుల శ్రేయస్సు కోసం పట్టుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేందర్, వేల్పూర్ సహకార సంఘం డైరెక్టర్ రాజేందర్, కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ దామోదర్‌గౌడ్, మల్లేష్, రమణ, వినోద్, రవి, రాము, స్వరూప, ఇంద్రగౌడ్, చరణ్, భగవన్‌దాస్, మల్లా రెడ్డి, ఏఈవోలు, ఫిషర్‌మ్యాన్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి



కలశాన్ని ఊరేగిస్తున్న వేద పండితులు, గ్రామస్థులు

భక్తివాడగా బాన్సువాడ

- మైలారం గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి


నసురుల్లాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు భక్తి మార్గంలో నడుస్తున్నాయని, బాన్సువాడ భక్తివాడగా మారుతోందని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే, చైర్మన్‌కు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నో గుడులకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. తద్వారా ఆయా గ్రామాల ప్రజలు దైవ చింతనతో గుడులను మంచిగా కట్టుకుంటున్నారన్నారు. అనంతరం ఆలయంలోని యజ్ఞశాలలో పూర్ణాహుతి కార్యక్రమంలో ఆయన పాల్గొని, గ్రామస్థులందరూ భక్తి మార్గంలో ముందుకు నడవాలని సూచించారు. అనంతరం ముదిరాజ్ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెర్క శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సాయిరాం యాదవ్, మాజీ ఎంపీటీసీ మహేందర్, మాజీ వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం సభ్యులు జగన్, కర్రం భాస్కర్, ధూళి శంకర్, రాము, కనుగంట్ల శ్రీను, అల్లం రాములు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

యజ్ఞశాలలో పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పోచారం





- కంకర రోడ్డును తలపిస్తున్న తల్వేద తారు రోడ్డు

ఆంధ్రజ్యోతి ఫోకస్



గుంతను పూడ్చిందిలా..

అతుకులు.. గతుకులు
ఇవే(o) మరమ్మతులు

- తల్వేద రోడ్డులో లోపించిన నాణ్యత
- ఇంకా పోయని సైడ్ బరమ్స్
- కంకర రోడ్డును తలపిస్తున్న వైనం
- కరువైన అధికారుల పర్యవేక్షణ

నందిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లోని రోడ్లను బాగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను మంజూరు చేస్తుంటే కొందరు అవినీతి అధికారుల లాలూచీ, కాంట్రాక్టర్ల కక్కుర్తి వల్ల సర్కారు లక్ష్యం నెరవేరడం లేదు. ఇందుకు నిదర్శనం తల్వేద రోడ్డే. సుమారు ఏడాది క్రితం పోసిన కంకర, తారు అప్పుడే పోయింది. పైపైగా పోసిన డాంబర్ చిన్నపాటి వర్షపు చిరు జల్లులకే కొట్టుకుపోయింది. పెద్ద గుంతలు ఏర్పడి రోడ్డు ఆనవాళ్లు కోల్పోయింది. వాటికి మళ్లీ చేపట్టిన మరమ్మతులూ తూతూ మంత్రంగా చేపట్టారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత లోపించినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

రోడ్డుకు ఇరువైపులా 5 ఫీట్ల వెడల్పు మట్టి పోయాలి

- పెర్కిట్ సాయరెడ్డి, మాజీ ఉపసర్పంచ్, తల్వేద



తల్వేద తారు రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించింది. ఆర్అండ్‌బీ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో సదరు కాంట్రాక్టర్ రోడ్డు పనులు ఇష్టారీతిన చేశారు. తారు రోడ్డుకు ఇరువైపులా 5 ఫీట్ల చొప్పున సైడ్ బరమ్స్ (మట్టి) వేయాల్సి ఉంటుంది. కొద్దిదూరం పాటు ఫీటు మందంతోనే మట్టిపోసి చేతులు దులుపుకున్నారు. లక్షల రూపాయల ప్రజాధనం మట్టిపాలైంది. జిల్లాస్థాయి అధికారులు స్పందించి నాణ్యతతో పనులు చేపట్టాలి. లేనిపక్షంలో నాలుగు గ్రామాల ప్రజలతో ఆందోళన చేస్తాం.

నందిపేట-జన్నేపల్లి వరకూ అధ్వానంగా..

నందిపేట-జన్నేపల్లి మెయిన్ రోడ్డు నుంచి దేవిపట్నం, చింరాజ్‌పల్లి, లక్ష్మంపల్లి మీదుగా తల్వేద గ్రామం వరకు తారు రోడ్డు మరమ్మతులకు గత ప్రభుత్వం రూ.74లక్షలు మంజూరు చేసింది. మెంటెనెన్స్ ఆఫ్ రూరల్ రోడ్స్ గ్రాంట్‌కింద మంజూరైన నిధులతో సుమారు 3.6 కిలోమీటర్ల మేరకు తారు రోడ్డు వేశారు. ఆర్అండ్‌బీ అధికారుల అలసత్వం, పనులు దక్కించుకున్న శ్రీ సాయిశక్తి కన్‌స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంగా కారణంగా రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేకపోయారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆరు మాసాలకే కంకర తేలి మట్టి రోడ్డును తలపిస్తోంది. పెద్ద గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరిగాయి. సైడ్ బరమ్స్ పోయకపోవడంతో వాహనాల వేగానికి తారు కొట్టుకుపోతోంది. ఆయా గ్రామాల ప్రజల ఆందోళనతో ఆంధ్రజ్యోతి మినీలోనాణ్యతకు తూట్లు అనే శీర్షికతో వార్తా కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్అండ్‌బి అధికారులు శ్రీసాయిశక్తి కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఆదేశాలు ఇచ్చారు. దీంతో సదరు కాంట్రాక్టర్ నాణ్యతతో చేపట్టాల్సిన మరమ్మతులను తూతూ మంత్రంగా చేపట్టారు. తారు రోడ్డుకు మధ్యలో ఏర్పడ్డ గంతలను పూడ్చారు. రోడ్డుకు ఇరువైపులా తారు కొట్టుకుపోవడంతో అక్కడక్కడ మళ్లీ తారును పోసి అతుకులు అద్దారు. మళ్లీ సైడ్ బరమ్స్ పోయకుండా వదిలేశారు. దీంతో తల్వేద తారు రోడ్డు పరిస్థితి ఎక్కడ వేసి గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. నాసికరం రోడ్డు నిర్మాణంలో పర్యవేక్షణ చేయని ఆర్అండ్‌బీ అధికారులపై అలాగే నిబంధనలు పాటించకుండా తారు రోడ్డు వేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని దేవి పట్నం, చింరాజ్‌పల్లి, లక్ష్మంపల్లి, తల్వేద గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మళ్లీ రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు.



ఇటీవల మరమ్మతులు చేపట్టిన తల్వేద తారు రోడ్డు ఇలా..



27 వార్డులో ప్రకృతివనంలో పెరిగిన పిచ్చిమొక్కలు

పట్టణ ప్రకృతి వనాల
నిర్వహణ ఏదీ?

- కామారెడ్డిలో అధ్వానంగా పట్టణ ప్రకృతివనాలు
- రూ.లక్షలు పెట్టి ప్రకృతివనాలు ఏర్పాటుచేసిన నిర్వహణ కరువు
- పిచ్చిమొక్కలు,పొదలతో నిండిపోవడంతో ప్రజలకు అందని ఆహ్లాదం
- పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇదే పరిస్థితి
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన



కామారెడ్డిటౌన్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మాదిరి పట్టణాలలో సైతం పచ్చదనంతో కూడిన ఆహ్లాదమైన వాతావరణం ప్రజలకు కల్పించాలని గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన పట్టణ ప్రకృతివనాలు వృధాగా మారుతున్నాయి. లక్షల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ఏర్పాటుచేసిన వనాలను పట్టించుకునే వారే కరవయ్యారు. ఖర్చు చేసిన నిధులు వృధా కావడంతో పాటు ప్రజలకు ఆహ్లాదం దూరమవుతోంది. కామారెడ్డి మున్సిపాలిటి పరిధిలో పట్టణ ప్రకృతివనాలను ఏర్పాటుచేసేందుకు ఆగమేఘాలమీద ఆతృత ప్రదర్శించిన అధికారులు వాటి సంరక్షణను మాత్రం గాలికి వదిలేస్తున్నారు. పట్టణ ప్రకృతివనాలు ఏర్పాటుచేసినప్పుడు చూపిన శ్రద్ధ వాటి సంరక్షణపై మాత్రం చూపడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పట్టణంలోని అన్ని వార్డులకు చెందిన పట్టణ ప్రకృతివనాలతో పాటు పలు వార్డులలో క్రీడాప్రాంగణాలు పిచ్చిమొక్కలతో నిండిపోయి వాటిని ఏర్పాటుచేసినప్పటి రూపురేఖలు ప్రస్తుత రూపురేఖలకు పొంతన లేకుండా పోయింది. మొత్తం పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిన అసలు అటువైపు కన్నెత్తి చూసిన నాధుడే కరవయ్యాడని ఆయా ప్రాంతాల వాసులు పేర్కొంటున్నారు.

ప్రారంభంలో ఉన్న శ్రద్ధ.. సంరక్షణపై లేదు

ప్రజలకు పచ్చని వాతవరణంతో పాటు ఆహ్లాదాన్ని అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన ప్రకృతివనాలు ఆయా వార్డుల కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నీరుగారుతోంది. పల్లె ప్రకృతివనాల లాగే పట్టణ ప్రజలకు పట్టణ ప్రకృతివనాలు ఏర్పాటుచేయాలని గత ప్రభుత్వం ఆలోచన చేసి దాని కార్యరూపం దాల్చేలా చర్యలు చేపట్టింది. దీంతో ప్రారంభంలోనే హడావిడి చేసి పార్కుల్లాగే మొక్కలను నాటేల చేసిన అధికారులు పచ్చటి వాతావరణం తీసుకోచ్చి వదిలేశారు. ప్రస్తుతం వాటి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో ఏర్పాటుచేసిన వార్డులలోని పట్టణ ప్రకృతి వనాలను పర్యవేక్షణ చేసి వాటి సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉన్న వాటి వైపు కన్నెతి చూడకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి అసలు ప్రజలు వినియోగించుకోలేని పరిస్థితిలోకి చేరుతున్నాయి.

ఆహ్లోదం కరువు

పట్టణంలోని ఆయా వార్డులలో ఏర్పాటుచేసిన పట్టణ ప్రకృతివనాలు అసలు ప్రజలకు ఆహ్లాదం పంచడం కాదు కదా రోగాలకు నెలవుగా మారుతున్నాయి. కేవలం ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది కాబట్టి ఎక్కడ పడితే ఎక్కడ ఏర్పాటుచేసి వాటిని సంరక్షణ చర్యలు గాలికి వదిలేశారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని వార్డులలో మురికి కుంటల వద్ద ప్రకృతివనాలు ఏర్పాటుచేశారు. దీంతో పాములు, కీటకాలు, దోమలు ఆవాసాలు చేసుకుంటున్నాయి. కొన్ని వార్డులలో స్థలభావంతో ఇతర వార్డులలో పట్టణ ప్రకృతివనాలను ఏర్పాటుచేసిన అధికారులు వాటిని సైతం పట్టించుకోవడం లేదు. కేవలం పట్టణప్రకృతివనాలు ఏర్పాటుచేశామా మమ అనిపించేశామా అని మున్సిపల్ అధికారులు ఆలోచన చేస్తున్నారని...అవి ప్రజలకు ఉపయోగపడితే మాకేంటి...పడకపోతే మాకేంటి అనే ధోరణిలో అధికారులు ఉంటున్నారనే వాదనలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.





సరైన నిర్వహణ లేక ప్రకృతి వనాల్లో పేరుకున్న చెత్తాచెదారం, పెరిగిన పిచ్చి మొక్కలు



జర దేఖో!!

అస్తవ్యస్తంగా ఉన్న మోడల్ స్కూల్ రోడ్డు

అధ్వానంగా తిరుమల కాలనీ రోడ్డు

- ఏళ్లు గడుస్తున్నా వేయని రోడ్డు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

పెర్కిట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ 7వార్డు తిరుమల కాలనీరోడ్డు గుంతలతో అధ్వానంగా తయారైంది. చినుకు పడితే రోడ్డు మరింత అధ్వానంగా మారి వాహనదారుల రాకపోకలకు, పాదాచారులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డు గుండా ప్రజలు రైల్వేస్టేషన్‌కు వెళ్తుంటారు. కొన్ని సంవత్సరాల నుంచి అధికారుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూ సమస్యలు విన్నవించినప్పటికీ కార్యరూపం దాల్చలేదని ప్రజలు వాపోతున్నారు. ఆర్మూర్‌లోని విలీన గ్రామాలు పెర్కిట్, మామిడిపల్లి గ్రామలలో మొదటి సారిగా శిలాఫలకం వేసింది ఈ రోడ్డుకేనని, కానీ అప్పటి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి శిలాఫలక వేసి ప్రారంభోత్సవం చేశారే కానీ ఏళ్లు గడుస్తున్నా రోడ్డు వేయలేదని స్థానికులు చెప్తున్నారు. నిత్యం ఈ రోడ్డు గుండా టిప్పర్‌లు, వాహనాలు ఎక్కువగా ప్రయాణిస్తుండడంతో దుమ్ము, దుళి వాటి కలుష్యంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పనులు చేయడానికి బాధ్యతలు తీసుకున్న రోడ్డు కాంట్రాక్టర్ పనులు చేయలేక చేతులెత్తేయడంతో రోడ్డు వేయలేకపోయామని, అధికారులు అంటున్నారు. రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం వేసి ఏళ్లు గడిచినప్పటికీ పనులు చేపట్టకపోవడంతో ఆగ్రహించిన గుర్తుతెలియని వ్యక్తులు శిలాఫలకం ధ్వంసం చేశారు. అలాగే కాలనీలో కస్తూర్బాగాంధీ బాలికల వసతిగృహం ఉండడంతో విద్యార్థులు, అధ్యాపకులు తల్లిదండ్రులు ఈ రోడ్డు గుండా వసతిగృహానికి చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే పక్కనే ఉన్న మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డు కూడా గుంతలతో అధ్వానంగా తయారైంది. కాలనీవాసులు, కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానికులు ఎన్నిసార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించిన రోడ్డు నిర్మాణం జరగలేదని, వెంటనే రోడ్డునిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలు పడి అధ్వానంగా మారిన తిరుమలకాలనీ రోడ్డు

రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాలి

- గంగాధర్, అధ్యక్షుడు, తిరుమల కాలనీ అభివృద్ధి కమిటీ



తిరుమల కాలనీ రోడ్డు నిర్మాణం గురించి పలుమార్లు ప్రజాప్రతినిధులను, అధికారులను కలిసి విన్నవించాం. సంవత్సరాలు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం జరగలేదు. దీంతో మట్టి రోడ్డు గుండా వాహన రాకపోకలతో వచ్చే దుమ్మూ దూళితో కాలనీవాసులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రోడ్డు వేయాలని కోరుతున్నాం.

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

● కామారెడ్డిలో మెగా రక్తదాన శిబిరం



కామారెడ్డిలో రక్తదానం శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ



భారీ కేకును కట్‌చేస్తున్న చైర్‌పర్సన్, నాయకులు



తాడ్వాయిలో..



భిక్కనూరు మండలం జంగంపల్లిలో..



దోమకొండ చాముండేశ్వరీ ఆలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని శుక్రవారం కామారెడ్డి మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ఇందులో 300కు పైగా వ్యక్తులు రక్తదానం చేశారు. సదాశివనగర్, తాడ్వాయి రామారెడ్డి, భిక్కనూరు, దోమకొండ, ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, నసురుల్లాబాద్, మద్నూర్, నిజాంసాగర్, బీర్కూర్, పెద్దకొడప్‌గల్ మండలాల్లోని పలు గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్న మహానేత

కామారెడ్డిటౌన్: ఎన్నోఏళ్లుగా అనేక కష్టనష్టాలతో ఇబ్బందులు పడుతున్ననిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్న మహానేత సీఎం రేవంత్‌రెడ్డి అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి అన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

పెద్ద కొడప్‌గల్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వడ్లం గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ పిట్లం తరఫున కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పిట్లం బాధ్యులు కాశిరెడ్డి, కిషన్, వేణు, కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్, మొగులాగౌడ్, చాంద్‌పాష తదితరులు పాల్గొన్నారు.



మైలారం గ్రామంలో



రోగులకు పండ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం



పండ్లు పంపిణీ చేస్తున్న గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి



జుక్కల్ మండల కేంద్రంలో..



ఎల్లారెడ్డిలో ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ధాన్యం కేటాయింపుల్లో అవకతవకలు!

(5వ పేజీ తరువాయి...)

అధికారులు ధాన్యం కేటాయింపులు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 129 రైస్‌మిల్లర్లు ష్యూరిటీలు ఇచ్చారని, వారికి మాత్రమే కేటాయింపులు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

423 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. 423 కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. సన్నరకం వడ్ల కొనుగోళ్లకు అవసరమున్న చోట ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 312 కొనుగోలు కేంద్రాల్లో 7,100 మంది రైతుల నుంచి 51,480 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో సన్నలు 7,200 మెట్రిక్ టన్నులు కాగా.. దొడ్డురకం 43 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రస్తుతం రాష్ట్రంలోనే కామారెడ్డి జిల్లా రెండో స్థానంలో ఉందని అధికారులు చెబుతున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించేందుకు లారీల కొరత లేకుండా 10 సెక్టార్‌లలో ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పిస్తున్నారు. కేటాయించిన మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని తరలిస్తున్నారు.

బ్యాంక్ గ్యారెంటీ ఇచ్చిన మిల్లులకే ధాన్యం

● రాజేందర్, సివిల్ సప్లయ్ డీఎం, కామారెడ్డి

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ధాన్యం కేటాయింపులు రైస్ మిల్లులకు చేస్తున్నాం. నిబంధనల మేరకు బ్యాంక్ గ్యారెంటీ ఇచ్చిన రైస్ మిల్లులకే ధాన్యం కేటాయింపులు చేశాం. ఇప్పటి వరకు 129 రైస్ మిల్లర్లు బ్యాంక్ ష్యూరిటీలు అందించారు. పత్రాలన్నింటినీ క్షుణంగా పరిశీలించి 112 మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేసి.. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆ మిల్లులకు తరలిస్తున్నాం. మిగితా రైస్ మిల్లుల ష్యూరిటీ పత్రాలను పరిశీలించి కేటాయింపులు చేస్తాం. ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రంలోనే కామారెడ్డి జిల్లా ప్రస్తుతం రెండో స్థానంలో ఉంది.

బాలిక పట్ల ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

● ఘటన బయటకు రాకుండా సహకరించిన ఇద్దరి రిమాండ్?

భిక్కనూరు, నవంబరు 8: మండలంలోని ఒక పాఠశాలలో బాలికపై పాఠశాల ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన జరిగి దాదాపు మూడు నెలలు గడుస్తున్నా ఈ విషయాన్ని బయటకు రాకుండా పాఠశాల సిబ్బంది, గ్రామానికి చెందిన కొందరు జాగ్రత్త తీసుకుని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడిని ఆ పాఠశాల నుంచి మరో పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. కానీ ఇటీవల జిల్లా న్యాయాధికారి భిక్కనూరు మండలకేంద్రానికి రాగా ఈ విషయాన్ని ఆ గ్రామానికి చెందిన కొందరు జిల్లా న్యాయాధికారి దృష్టికి తీసుకురావడంతో ఈ విషయం బయటకు వచ్చింది. దీంతో జడ్జీ విచారణ చేయాలని పోలీసులను సూచించగా ఎల్లారెడ్డి డీఎస్పీ ఆధ్వర్యంలో పోక్సో కేసుగా నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఈ కేసులో ఉపాధ్యాయుడితో పాటుగా ఈ సంఘటన బయటకు రాకుండా సహకరించిన పాఠశాల హెచ్‌ఎంతో పాటుగా అదే గ్రామానికి చెందిన ఒక గ్రామపెద్దను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.

రాష్ట్రస్థాయి హాకీ క్రీడలకు గర్గుల్ విద్యార్థులు..

కామారెడ్డిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 68 వ రాష్ట్రస్థాయి అండర్ 17 బాలికల హాకి టోర్నమెంటుకు జడ్పీహెచ్ఎస్ గర్గుల్ పాఠశాల క్రీడాకారులు ప్రవళిక, భవానిలు ఎంపికైనట్లు పీడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 11 నుంచి 13 వరకు నిజామాబాద్‌లోని విద్యాభారతీ గ్లోబల్ స్కూల్‌లో జరిగే హాకీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.

కబడ్డీ పోటీలకు కేటీఎస్ విద్యార్థి

గాంధారి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 14 కబడ్డి పోటిలకు మండలాల్లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి దివాకర్ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ పరశురాం తెలిపారు. ఈ నెల 8 నుంచి యాదాద్రి జిల్లాతుర్కపల్లి మండలం మదాపూర్ గ్రామంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డిపోటిల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా తరఫున దివాకర్ పాల్గొంటారని తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత

గాంధారి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన అంజయ్య ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై హైదారాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఆసుపత్రుల వైద్యఖర్చుల కోసం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రూ.2లక్షల ఎల్‌ఓ సీని మంజూరు చేయించగా శుక్రవారం వంజరి శంకర్ బాధితునికి అందించారు.

కుల గణనను పకడ్బందీగా నిర్వహించాలి

లింగంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కుల గణన సర్వేను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను మండల పంచాయతీ అధికారి మలహరి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలో నిర్వహిస్తున్న కుల గణన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలను, సలహాలను అందజేశారు. అనంతరం పాత ఎల్లాపూర్ గ్రామంలో నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో నీటిని నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయా పాత్రలలో నీరు నిల్వ ఉంటే ఆ నిల్వ ఉన్న నీటిలో దోమలు ప్రబలి సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట స్థానిక పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కుల గణనను సద్వినియోగించుకోండి

పెద్దకొడప్‌గల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కుల గణన సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. జుక్కల్ మండల కేంద్రంలో శుక్రవారం జరుగుతున్న ఇంటికి స్టిక్కర్ వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ మండలంలో 15260 ఇండ్లకు స్టిక్కర్ వేసే కార్యక్రమం ఉండగా నేటి వరకు 14160 ఇండ్లకు స్టిక్కర్ వేయడం జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా తమ ఇంటికి సర్వేకు సంబంధించిన స్టిక్కర్ వేయకపోతే సంబంధిత జీపీ కార్యదర్శులను సంప్రదించాలని సూచించారు.

'లారీల కొరత లేకుండా చూస్తాం'

దోమకొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):వరిధాన్యం రైస్‌మిల్లుకు తరలించేందుకు లారీల కొరత లేకుండా చూస్తామని తహసీల్దార్ సంజయ్‌రావ్, ఏఈవో అన్న్యూష అన్నారు. శుక్రవారం మండలంలోని గొట్టిముక్కుల, సంగమేశ్వర్, అంచనూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యంలో పొల్లు లేకున్న బస్తా 42.3 వందల గ్రాముల చొప్పున తూకం వేస్తున్నారని ఆయా గ్రామాల్లో రైతులు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే తహసీల్దార్ సీఈవో బాల్‌రెడ్డికి ఫోన్‌లో మాట్లాడి రైతులు నష్టపోకుండా నిబంధనల ప్రకారం తూకం వేయాలని సూచించారు. ధాన్యం జాలీ లేకుండా కాంట చేయడం వలన బస్తా 42 కిలోల చొప్పన కాంట చేయడం జరుగుతుందని ఆయన తహసీల్దార్‌కు వివరించారు. కార్యక్రమంలో ఏఈవో అన్న్యూష, జైపాల్, రైతులు గంగయ్య, సురేందర్‌రెడ్డి, రాజిరెడ్డి,జీవన్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

మిర్జాపూర్ చెరువులో చేప పిల్లల విడుదల

నసురుల్లాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండల మిర్జాపూర్ గ్రామ చెరువులో శుక్రవారం గంగపుత్ర సంఘ సభ్యుల ఆధ్వర్యంలో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షులు గాదం సత్యనారాయణ మాట్లాడుతూ మిర్జాపూర్ చెరువులో ఉచిత చేప పిల్లలను పంపిణీ చేయడం జరిగిందన్నారు చేప పిల్లల సైజ్ 80-100 ఎంఎం కలదని, ఈ చేప పిల్లలను తూకం వేసి నాణ్యత చూసి చెరువులో వదలడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు మాజీ గంగపుత్ర జిల్లా సంఘం అధ్యక్షుడు దొబ్బల గంగాధర్, సంఘ కార్యదర్శి ఉషికేలా శ్రీనివాస్, డైరెక్టర్లు రుద్రారం గంగాధర్, ఉష్కేలా హన్మాండ్లు, ఉష్కేల శ్రీనివాస్, పల్లికొండ పోశెట్టి, సభ్యులు దొబ్బల రాములు, ఏల్లబోయి దొబ్బాల గంగారాం, పల్లికొండ మహేందర్, భూమాబోయి, శంకర్, దొబ్బల శంకర్, మాజీ సర్పంచ్ బుద్దె గంగాధర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగిలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'మా జీవితాలను అంధకారంలో నెట్టకండి'

కామారెడ్డిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ, ఉపకులాల జీవితాలను అంధకారంలోకి నెట్టవద్దని మాదిగ విద్యార్థి ఉద్యమనాయకుడు గడ్డం సంపత్ అన్నారు. తెలంగాణలో సుప్రింకోర్టు నిర్ణయం తర్వాత మొదటగా మన రాష్ట్రమే ఆర్డినెన్స్ తెచ్చి వర్గీకరణ అమలుచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారన్నారు.అయినప్పటికి అలా ఆర్డినెన్స్ లేకుండా ఉద్యోగ ప్రకటనలు చేయడం వల్ల మాదిగలు,ఉపకులాల వారికి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. మూడు దశాబ్దాల మాదిగల న్యాయమైన ఆకాంక్షను సుప్రింకోర్టు గుర్తించిందని అలాగే ఆయా రాష్ట్రాలు అమలుచేస్తున్నాయన్నారు. తెలంగాణలో మాత్రం మూడునెలలు దాటిన అమలుకునోచుకోవడం లేదన్నారు. ప్రస్తుతం జరగబోయే గ్రూప్-2,3 ఉద్యోగాలలో ఆర్డినెన్స్ తెచ్చి వర్గీకరణ అమలుచేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భిక్కనూరు, నవంబరు 8: భిక్కనూరు మండలంలోని అంతంపల్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం దోమకొండ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన కొడిప్యాక స్వామిగౌడ్ (44) మండలంలోని తిప్పాపూర్ కల్లుడిపోలో గత కొంతకాలంగా పనిచేస్తున్నాడు. పని పూర్తి చేసుకుని ఇంటికి బైక్‌పై వెళ్తుండగా అంతంపల్లి గ్రామశివారులో 44వ జాతీయరహదారిపై తన బైక్ వెనుక టైరు ప్రమాదవశాత్తు పేలిపోయింది. దీంతో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఇనుప రేలింగ్‌కు ఢీకొనడంతో తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య భవన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మోటార్ సైకిళ్లు చోరీ చేస్తున్న నిందితుడి రిమాండ్

పెద్దకొడప్‌గల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిళ్లను చోరీ చేసి విక్రయించేందుకు మహారాష్ట్రకు వెళ్తున్న నిందితుడికి పట్టుకుని అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు బిచ్కుంద సీఐ నరేష్ తెలిపారు. ఇందుకు సంబందించిన వివరాలను సీఐ వెల్లడించారు. పెద్ద కొడప్‌గల్ మండలం బేగంపూర్ తాండాకు చెందిన సుభాష్ గత కొద్ది రోజులుగా పెద్ద కొడప్‌గల్, పిట్లం, ఎల్లారెడ్డి మండల కేంద్రాలలో మూడు మోటార్ సైకిళ్లను దొంగిలించాడని తెలిపారు. వీటిని అంజనీ శివారు ప్రాంతంలో దాచి మహారాష్ట్రలో అమ్మేందుకు వాటిని తీసుకవెల్లే క్రమంలో తమకు అందిన సమాచారం మేరకు నిందితుడిని పట్టుకుని మూడు మోటార్ సైకిళ్ల స్వాదీనం చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

పెద్దకొడప్‌గల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యులు మణికుమార్ మాట్లాడుతూ గ్రామంలోని పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయడం జరిగిందని తెలిపారు. ఈ శిబిరంలో 226 ఆవులు. 167 గేదేలకు గాలికుంటు టీకాలు వేయడం జరిగిందని తెలిపారు. గ్రామాలలో పశువులకు ఏదైనా సమస్యలు ఉంటే తనను సంప్రదించాలని సూచించారు.

లింగంపల్లిలో ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు

● రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



లింగంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్

నాగిరెడ్డిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుంగిపోయిన రోడ్డుకు సొసైటీ ఆధ్వర్యంలో తాత్కాలిక మరమ్మతులు చేయడంతో లింగంపల్లి గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోళ్ళు తిరిగి ప్రారంభమయ్యాయి. లింగంపల్లి రోడ్డు బాగు లేక గ్రామానికి వడ్ల లారీలు రాకపోవడంతో గురువారం గ్రామంలో ధాన్యం కొనుగోలు నిలిచిపోగా, ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతితో పాటు పలు పత్రికలు ఈ వార్తను శుక్రవారం ప్రధానంగా పత్రికల్లో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. మాల్తుమ్మెద సొసైటీ ఆధ్వర్యంలో సు మారు 10 వేల రూపాయలు వెచ్చించి కుంగి పోయిన రోడ్డుకు పైప్‌లు వేసి సుమారు 40 ట్రాక్టర్ల మొరం వేసి రోడ్డును తాత్కాలికంగా మరమ్మతులు చేసి బాగు చేశారు. రోడ్డుకు మరమ్మతులు చేయడంతో గ్రామానికి వడ్ల లారీలు వచ్చేందుకు అవకాశం కలిగింది. దీంతో సొసైటీ అధికారులు వెంటనే గ్రామంలో నిలిచిపోయిన వరి కొనుగోళ్లను ప్రారంభించారు. మరమ్మతులు చేసిన రోడ్డును, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో సొసైటీ ఆధ్వర్యంలో వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయడం అభినందనీయమన్నారు. ఈ లింగంపల్లి రోడ్డుకు శాశ్వత మరమ్మతుల కోసం ఐబీ ఆధ్వర్యంలో రూ.9.9 లక్షలతో ప్రతి పాదనలు పంపించినట్లు తెలిపారు. నిధులు మంజూరు కాగానే అధికారులు రోడ్డుకు మరమ్మతులు జరుపుతారని తెలిపారు. ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, తాండూర్ సొసైటీ అధ్యక్షులు గంగారెడ్డి, మాజీ సర్పంచ్ కుమార్, మండల కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

త్రిలింగేశ్వరాలయ అభివృద్ధి కోసం ఆర్డీవోకు వినతి

నాగిరెడ్డిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ గ్రామంలో గల అతి పురాతన ఆలయమైన త్రిలింగేశ్వర ఆలయంలో అభివృద్ధి కోసం శుక్ర వారం ఆలయ కమిటీ సభ్యులు ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్డీవో లింగంపల్లి గ్రామానికి వచ్చిన సందర్భంగా ఆర్డీవోనుయ కలిసి ఆలయం అభివృద్ధికి కావాల్సిన సౌకర్యాల గురించి వినతిపత్రాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు దత్తు, తాండూర్ సొసైటీ అధ్యక్షులు గంగారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కుమార్, మురళీగౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో వైకల్యం తగ్గుతుంది

లింగంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వ్యాయామంతో వైకల్యం తగ్గు తుందని ఫిజియోథేరఫీ నిపునుడు సాయికిరణ్‌గౌడ్ అన్నారు. ఆయన లింగం పేట భవిత సెంటర్‌లో శుక్రవారం దివ్యాంగులకు ఫిజియోథెరఫీ చేశాడు. ఈ సందర్భంగా పలువరు వికలాంగులకు ఫిజియోథెరఫీ చేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతీ రోజు విద్యార్థులకు ఇంటివద్ద వారి తల్లి దండ్రులు వారి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపి వ్యయామం చేయించాలన్నారు. దీనితో క్రమేపి వైకల్యం తగ్గుతుందని, ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మణికంఠ, ఐఈఆర్‌పీలు అశ్విని ఉన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

ఎల్లారెడ్డి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలోని గూడెం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సక్రమంగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హరీష్, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, కౌన్సిలర్ నీలకంఠం తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మద్నూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం లోని తెలంగాణ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం డోంగ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తెలుసుకుని తగిన చికితను అందజేశారు. చలి కాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలు, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. సిగరేట్లు, తంబాకు వాడకంతో పాఠశాల, కళాశాలలో విద్యార్థులపై కలిగేటువంటి దుష్పరిణామాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడకూడదని జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డోంగ్లి పీహెచ్‌సీ సిబ్బంది ఎంఎల్‌హెచ్‌పీ బస్వరాజ్, రేణుకా, ఆశా వర్కర్ కమల, ప్రిన్సిపాల్ ఎన్.గంగాకిషోర్ పాల్గొన్నారు.

చదువు కొనసాగడానికి ఆధారం చూపండి



పాత ఆధార్ కార్డును చూపుతున్న అరుణ్‌కుమార్

తాడ్వాయి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేమి కలాన్ గ్రామానికి చెందిన అడిగే అరుణ్ కుమార్ డిగ్రీ చదివేందుకు మార్గం చూపాలని అధికారులను వేడుకుంటున్నాడు. అరుణ్ కుమార్ రెండేళ్లుగా డిగ్రీ ప్రవేశ పరీక్ష కోసం దోస్త్‌లో అప్లికేషన్ ఫారం యాక్టివేట్ చేయడం లేదని వాపోతున్నాడు. అతని సమస్య పరిష్కారం కోసం ఏ ఆధార్ సెంటర్‌కు వెళ్లినా ప్రయోజనం లేకుండా పోతుంది. పదో తరగతి వరకు అతని ఆధార్ కార్డు సక్రమంగా పని చేసిన డిగ్రీ ప్రవేశంలో ఆధార్ కార్డు డీ యాక్టివేట్ అయిందని దోస్తు అప్లికేషన్ పెట్టుకుంటే తీసుకోవడం లేదని బోరున విలపించాడు. మండల, జిల్లా కేంద్రాల్లో ఆధార్ సెంటర్లకు తిరిగిన ఫలితం లేకుండా పోయిందన్నాడు. అలాగే హైదరాబాద్‌లోని ఆధార్ సెంటర్ వద్దకు వెళ్లిన అక్కడ ఎవరూ పట్టించుకోకపోవడంతో తిరిగి వచ్చానని తెలిపాడు. ఆధార్ టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసిన స్పందించడం లేదన్నారు. సోమవారం తమకు మీరే దారి చూపాలని కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తాను డిగ్రీ చదివేందుకు నా ఆధార్ కార్డును యాక్టివేట్ చేసేలా చూడాలని బాధితుడు అంటున్నాడు. నా ఆధార్ కార్డు సరిగ్గా ఉంటే నేను ఇప్పటికీ ఆర్మీ లో సెలెక్ట్ అయ్యేవాడినని వాపోతున్నాడు. ఆధార్ కార్డు ధ్రువ పత్రాలు సరిగ్గా లేనందున అలాగే ఫింగర్ ప్రింట్స్ సరిగ్గా నమోదు కాకపోవడంతో ఆధార్ కార్డు డియాక్టివేట్ అవుతుందని మీరు ఆధార్ సెంటర్ల నిర్వాహకులు తెలిపారు. ఎలాగైనా అధికారులు స్పందించి తమకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

శాంతి - లక్కీ భాస్కర్
దర్శన్ - అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
ప్రియా 35 - అమరన్
ప్రియా 70 - క

బాన్సువాడ

మహేశ్వరి - లక్కీ భాస్కర్
వెంకటేశ్వర - అమరన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

